# కవ్వింత కథలు

## -వేదాంతం శ్రీపతిశర్మ



(ముందుగా ఓ మాట)

**అందమైన** ఆలోచనలన్నీ సాహితీ వినీలాకాశంలో తారల వలె ప్రభవిస్తూనే ఉంటాయి. ఒకటి పద్యం, ఇంకొకటి కథ, ఒకటి నాటకం, ఇంకొకటి నవల, ఒకటి వ్యాసం, ఇంకొకటి కవిత, మరొకటి కావ్యం.. ఇలా మనసును చంద్రుడిగా మలచినప్పుడు చుట్టూతా మెరిసేవన్నీ ఆలోచనల నక్షత్రాలే. కాకపోతే ఈ 'తారాశశాంకం' అందరినీ ఒకలాగే అలరిస్తుంది అనుకోవటం సరికాదు. ఒక్కొక్కరికి ఒక్కో నక్షత్రం సరిపోయినట్లు ఒక్కొక్కరి మనస్తత్వం ప్రకారం ఒక్కో సాహితీ ప్రక్రియ ఆనందాన్ని అందించటం సహజం.

ఆలోచనల అంతరంగం ఒక తరంగంలా సాగి శబ్దాలను తాకి పదజాలంలోకి అల్లుకుని ఒక రంగవల్లిలా రంగరించుకున్న వేళ కవిత్వం అనేది పద్యంలా కనిపించవచ్చు, కవితలా అనిపించవచ్చు.. కథలా కూడా దర్శనమివ్వవచ్చు.

అవధాన ప్రక్రియలో సమస్యాపూరణంలాగా, దృశ్యకావ్యం లేదా నాటక ప్రక్రియలో గర్భాన్ని ఆవిష్కరించే విధంగా కవితకు కథ వ్రాయటం అనేది తెలుగు సాహిత్యంలో ఒక వినూత్నమైన ప్రయోగం! 'కవిత' అనే పేరుగల అమ్మాయి రచయితకు తన కవిత ద్వారా పరిచయం అవుతుంది. అమ్మాయి అందిస్తున్న కవితలకు రచయిత కథలను సృజించి ఆమెకు మెయిల్ చేస్తూ అంటాడు. అలా పరిచయం పెరుగుతూ ఉంటుంది. కవిత తన కవితలో పలు అంశాలను స్పృశిస్తూ అంటుంది. ఇవి ఎక్కువగా స్త్రీ పురుష సంబంధాలు, బంధాలు, అనుబంధాలు, రాగద్వేషాలు, సౌందర్యారాధన, తప్పించుకోలేని జీవిత సత్యాలు.. కానీ ఎన్నో విషయాలు రసవత్తరంగా సాగిపోతూ ఉంటాయి.

కవిత రచయితను సవాలు చేస్తోందా లేక పరీక్షిస్తోందా లేక తన స్థాయిలో జీవిత భాగస్వామిని ఎంచుకుంటోందా అనే ఆలోచనలు కలుగుతాయి. ఇటు ప్రక్క రచయిత తన కథలలో అందించిన కవితలోని ప్రాణాన్ని పైకి చూపుతూనే సరికొత్త పరిస్థితులను ఎత్తి చూపటం కూడా జరుగుతూ ఉంటుంది.

కవితలోని వృత్తం, కథలోని ఇతివృత్తం కొన్ని సందర్భాలలో మమేకం కావటం, కొన్ని సందర్భాలలో సమానాంతరంగా సాగటం జరుగుతాయి. కవిత కోసం కథ వ్రాయటం అనేది కత్తిమీద సాములాంటిది. సామాజికపరమైన సంఘటనలను సృష్టించాలా లేక సహజంగా ఉన్నవాటిని మాలికలా అల్లి 'కవిత'ను ముగ్గులోకి దింపాలా అనేది విషయాన్ని ఆధారం చేసుకుని రచయిత ఎంచుకోవలసిన మార్గం.

కవిత పరిచయమవటం, కథ వ్రాయమనటం వంటివి 'కథాకౌముది' ద్వారా జూన్ 2016 http://www.koumudi.net/Monthly/20-6/june/june_20-6_kadhakoumudi_5.pdf సంచికలో 'వీలునామా' అనే కథలో మీరు చూడవచ్చు.

కవితకు కథ అనే ప్రక్రియలోని కవ్వింత వింతగానే మిగిలిపోతుందా, ఇద్దరికీ ఈ రసవత్తర స్థాయిలో అనుబంధం ఏర్పడుతుందా అనేది చివరి వరకు కవ్విస్తూనే ఉంటుంది.

వేదాంతం వేంకట సత్యవతి యిస్తున్న కవితలకు కథలను వేదాంతం శ్రీపతిశర్మ అందిస్తున్నారు.

****

# ఓ వానాకాలం పొద్దు

**స్కూటర్** ప్రక్కగా ఆపి రోడ్డు మీదకే ఉన్న ఆ చిన్ని హోటల్లోకి దూరాను. పావ్‌బాజీ ఆర్డర్ చేసి గుండ్రంగా ఉన్న టేబుల్ దగ్గర కుర్చున్నాను. సెల్ఫ్‌సర్వీస్ అయినా ఇక్కడ కొద్దిగా మాట వింటారు. 'కూర్చోండి' అని చెప్పి అతను తయారు చేస్తుంటే బలే ఉంది. వాన దంచుకుంటోంది.

ఈ అమ్మాయిలో ఏదో ఉంది. మనసులోకి ఓ చిలిపి ఆలోచన దూరినట్లు, ఇది నా సామ్రాజ్యం అన్నట్లు లోపలికి వస్తుంది. నన్ను చూసి చిలిపిగా నవ్వి ఎదురుగా కూర్చుంది.

'బృందగానం చదివాను.', చెప్పింది.

'గానం వింటారు కానీ చదవటం ఏంటి?'

'ఊ... కథలో ఏదో పాట కూడా విన్నట్లే ఉంది'

కవిత ఇపుడు నవ్వుతుంది. అనుకున్నప్పుడు ఎన్నడూ నవ్వదు.

నవ్వినప్పుడు ఏదో ఆలోచించే లోపల నవ్వు ఆపేస్తుంది. ఇందులో కూడా ఏదో అందం ఉంది అనిపిస్తుంది.

'కవిత లేదా హాండ్‌బాగ్‌లో?'

చుట్టూతా చూసింది. లేదన్నట్లు తల ఊపింది.

'చెబుతాను. గుర్తుంటుందా?'

'చెప్పండి'

***'చిట్టి సూరిగాడు చిరాకు పుట్టి మబ్బు ముసుగు తొడిగేసాడు.'***

'ఓ..బాగుంది'

***'కానీలెమ్మని నేనూ ఓ టీ కప్పుతో ఈజీ చెయిర్‌ను ఆశ్రయించాను.***

***ఇంతలో...***

***జిలుగు వర్షపుధారని ఛేదించుకుంటూ***

***ఓ క్రొక్కరు మెరుపుతీగె చటుక్కున***

***నా ఇంటి చూరునాశ్రయించింది.***

***అంతే.***

***నా నలభై వత్సరాలలో ఇరవై యింటిని కుర్చీకి తన్నిపెట్టి నిటారుగా స్థిరపడ్డాను.***

***ఇంతలో..***

***కొంటె సూరిగాడు కన్నుకొట్టుకుంటూ తొంగి చూసేసాడు.***

***అంతే..***

***మెరుపు తీగె మరి నిలువలేదుగా!***

***చ్చరున కాలిన నాలుకని 'ఉప్'మని ఊదుకుంటూ, మళ్ళీ ఓసారి నా చెలి ఈజీ ఛెయిర్‌ను ఆశ్రయించాను***

***కుర్చీలో వాలాను.***

కవిత లేచి '***వాన వెలిసింది***', అంది.

'బాగుంది. ఆ వానని నాలోకి పంపాక అక్కడ ఆగక ఏమవుతుంది?' అన్నాను.

'కథవ్రాయండి' అని చెప్పి వెళ్ళిపోయింది.

ఆలోచించాను. కవితను, తన కవితనూ గుర్తు తెచ్చుకున్నాను.

'ఓ వానాకాలం పొద్దు' అని వ్రాసాను.

'దోషం లేదు', అన్నాడు సుందరం. అతని వెనుక నిలుచునుంది ఛాయాదేవి.

'ఏంటి? మీ వెనుక నిలబడటం కూడా దోషమేనా?'

'లేదంటున్నాను కదా?'

'ఎందుకులేదు?'

'నేను టి.విలో ఇలా వార్తలు చదివే అమ్మాయిలను, ఏదో ప్రోగ్రామ్‌లు నడిపే వాళ్ళను ఎందుకు కళ్ళార్పకుండా చూస్తాననే కదా నీ బాధ?'

ఆమె ముందుకొచ్చింది.

'నా పేరు ఛాయ!'

'కరెక్ట్'

'ఏది చేసినా చూస్తాను'

'చూడు'

'దోషం దేనికి?'

'దోషం లేదంటున్నాను.'

'లేదన్నప్పుడు ఆ మాటెందుకొచ్చింది?'

'మాట వస్తుందేమోనని అక్కరలేదని నేను నిర్ధారించానన్నమాట' కాఫీ గ్లాసు తీసుకుంది ఛాయ.

'రకరకాల పూలు పూస్తూ ఉంటాయి. వాటిని చూడాలి కదా?'

'కరెక్ట్. అందుకే ఈ మధ్య కొద్దిగా జాగ్రత్తగా చూస్తున్నాను. విశ్లేషణకు పనికొస్తున్నాయి'

'ఈ మధ్యనే ఎందుకో?'

సుందరం లేచి వరండాలోకి వచ్చాడు. ఛాయ వెనుక వచ్చింది. ఇద్దరూ పిట్టగోడ దగ్గిర నిలుచున్నారు.

'ఓ మాటనుకుందాం' అన్నాడు సుందరం.

'చెప్పండి'

'ట్రాఫిక్‌లో సిగ్నల్ ఎక్కడుంటుంది?'

'నాలుగు వీధులు కలిస్తే సిగ్నల్ పెడతాడు'

'బాగా చెప్పావు. మగాడికి కూడా వయసులో నాలుగు పదులు కలిస్తే ఎక్కడినుండో సిగ్నల్‌లు వస్తు ఉంటాయి'

లోపలికి నడిచింది. వెనుక వెళ్ళాడు సుందరం.

'తెచ్చిపెట్టుకున్న సిగ్నల్స్ ఇవి. ఫేస్‌బుక్‌లో చాటింగ్, వాట్స్‌అప్‌లో ఫోటోలు, కొద్దిగా తగ్గిస్తే బాగుంటుంది సార్. ఆ ఫోన్‌ను వదిలి నన్ను చూస్తే అర్థం అవుతుంది.'

'నీ గురించి సరిగ్గా తెలియాలంటే ఎందరినో చూడాలి. ఎన్నో తీర్థయాత్రలు చేసి ఇంటిలోనే దైవం ఉందని తెలుసుకుంటాడు సరైన సాధకుడు'

ఛాయకు తిక్క వచ్చేస్తోంది. నడుము బిగించి కళ్ళు పెద్దవి చేసింది. జాగ్రత్తగా చూసాడు సుందరం. రాజకీయ నాయకులు పలుమార్లు స్త్రీలందరూ నడుము బిగించాలి అని ఎందుకంటారో అర్థమయింది.

'చిల్లరకొట్టుళ్ళను, చిలక కొట్టుళ్ళను వైవిధ్యం పేరుతో సమర్థించుకోవటం చాలా చూసాం. ఏంటి సంగతి?'

సుందరం లుంగీ పైకి కట్టేసాడు. ఎందుకో రేడియో పాట అందుకుంది.

'అందాలా ఆనందం ఇందేనయ్యా, అందం చూడవయ్యా, ఆనందించవయ్యా..' వాస్తవానికి ఆడది నడుము బిగించటం, మగాడు లుంగీ పైకెత్తటం సామాన్యమే. కాకపోతే మానసిక శాస్త్రంలో నిపుణులు, ఇతర శాస్త్రవేత్తలు ఈ మధ్య ఈ ప్రక్రియను గట్టిగా పరిశీలించినట్లు తెలుస్తోంది ఈ ప్రక్రియను సాహితీవేత్తలు కూడా ఏదైనా కథలో నున్న నడిబొడ్డును ఇటువంటి సంఘటనతో పోల్చటం మనం చూస్తున్నాం. అలాగే ఉన్నతమైన న్యాయవాదులు కూడా ఒకే కేసును చక్కగా పరిశీలించి కొంత దూరం వెళ్ళాక

'ద కోర్ట్ విల్ టేక్ పొసిషన్' - న్యాయస్థానం ఇప్పుడు ఇక్కడినుండి ఒక నిష్కర్షకు వచ్చే మార్గాన్ని సూచిస్తుంది అంటారు. రిఫరీలు ఈల వెయ్యటం, కుక్కరు మూడో కూత కూయటం, ఎటో పోయేవాడు కూడా ఇటు తిరిగి చూడటం కూడా ఇక్కడే

'చూడటం కూడా చెడిపోవటమేనా?'

'చెడిపోయాకనే చూడటం ప్రారంభమవుతుంది'

'అంటే నేను చెడిపోవటం అయిపోయి చాలాకాలం అయిందంటావు'

'కొద్దిగా టైం ఉంది'

'దేనికి?'

'చెడిపోవటానికి'

ఆలోచించాడు సుందరం. పైకోర్టుకు అపీలు పెట్టుకునేందుకు యిచ్చిన గడువా ఇది లేక మెడ పూర్తిగా పట్టేస్తే నాలుగు రోజులు నేలమీద పడుకునేందుకు డాక్టరు ఇచ్చిన అవకాశమా?

ఇద్దరూ ఒకరి వెనుక ఒకరు నడిచారు.

'ఇంతలో అంత రిబేటు ఎలా ఇచ్చావు ఛాయా?' టోన్ మార్చాడు సుందరం.

'భగవద్గీత చదవండి'

లుంగీ సరైన పొసిషన్‌కి వచ్చేసింది.

'నేనింకా రిటైర్ కాలేదు. తరువాత ఎలాగో..'

చెయ్యి అడ్డుపెట్టింది ఛాయ.

'కుర్రాళ్ళ కోసం గీతలో ఎంతుందో మొన్న ఓ స్వామీజీ వివరించాడు'

'గీత అంటే...'

ఛాయ ముఖం సూర్యుడిలా మారింది.

'ఈ జోకులే వద్దన్నది. మండుతుంది'

'ఛాయ కూల్‌గా ఉండాలి'

'అంటే?'

'ఛాయను భార్యగా పొందినవాడు అదృష్టవంతుడు'

కూల్ అయింది ఛాయ. అల్పసంతోషం నుండి ఆడది పుట్టిందని సుందరమే చాలా సార్లు అన్నాడు.

'భార్య అనే నీడలో ఉంటూ అక్కడక్కడ కాచే ఎండను చూడటం ప్రతి మగాడూ చేస్తూ ఉంటాడు'

మళ్ళీ పాదరసం పైకి ప్రాకింది.

'ఇంతకీ గీత గురించి ఎందుకు చెప్పానో తెలుసా?'

'చెప్పేసెయ్'

'శ్రీకృష్ణుడు తనని అందరిలోనూ, అందరినీ తనలో చూడమన్నాడు'

'కరెక్ట్'

'అంచాత ఏ అమ్మాయి బాగుందనిపించినా మీకు ముందర నేను గుర్తుకురావాలి'

'గుడ్ ఇప్పుడు అలాగే జరుగుతోంది. తరువాత ఏమవుతుందో చెప్పలేను'

'అంటే?'

'తాదాత్మ్యం చెంది అందరిలో నువ్వే కనిపిస్తే నన్ను నేను పట్టుకోవటం కష్టమైపోతే?'

ఛాయ ఈసారి కళ్ళు పెద్దవికావు, ఎర్రగా కూడా చేసి దగ్గరకి వచ్చింది. గట్టిగా పట్టుకున్నాడు సుందరం.

'సాష్టాంగం అంటే ఏంటో తెలుసా?,' చెవిలో చిన్నగా అడిగాడు.

'నా కనవసరం'

'మన నీడ మనలో కలసిపోవాలి ఛాయా...'

శనివారం మధ్యాహ్నం నిద్రలేచి కిటికీ వద్దకు వచ్చాడు సుందరం. నన్ను కాకుండా లెక్కేసుకోండి అనే వాడు ఎలా ముసుగు తన్నేస్తాడో సూర్యుడు కూడా నల్ల మబ్బులను పైకి తెచ్చుకుని విశ్రమిస్తున్నట్లుంది. కాలం ఎంత మారినా చినుకు ఉనికికి మట్టి ప్రకృతి గట్టిదనాన్ని తన సువాసనతో ప్రకటిస్తోంది. ఇంట్లో ఎవరూ లేరు. నా తరువాతే ఏదైనా అనే ధృవీకరణ పత్రం చివర ఎవరో సంతకం చేస్తున్నట్లు మబ్బుల చాటున మెరుపులు అలా మెరుస్తున్నాయి. సరైన రాగానికి విరివిగా తాళం తోడై అనర్గళంగా సంగతులతో కలసి శృతిలో సాగిన కృతిగా వర్షం ఓ భావజాలంలో భువనత్రయలను అతనికి చూపిస్తోంది.

పోటీపడుతున్న చినుకులను అదే పనిగా చూస్తున్నాడు సుందరం. ఈ వాన కురిస్తే తప్ప అసలు ఈ నేలమీద ఏముందో తెలియదు. ఓ దృశ్యం కనిపిస్తే తప్ప అసలు ఈ మనిషిలో ఎటువంటి ఆలోచనలు ఉన్నాయో తెలియదు. మరి ఆలోచనల నుండి కదా దృశ్యం ఏర్పడాలి? ఏమో భూమి మీద పచ్చదనం ఎంత ఉంటే అంత చక్కగా వానలు కురుస్తాయిట. అంటే అక్కడ కావలసింది ఇక్కడా ఉండాలి, ఇక్కడ కావలసింది అక్కడా ఉండాలి. అంతా ఆలోచనే. సర్వం స్పందనలోనే ఉంది. సంతోషంగా ఉన్నవాడి దగ్గరకే లక్ష్మి వస్తుందిట. సద్భావనలోనే సరైన జీవితం ఉంది.

వానజోరు పుంజుకుంది. వరండా క్రింద ఉన్న చిన్ని చిన్ని రాళ్ళూ, రప్పలూ అలా కొట్టుకుని పోతున్నాయి.

చూరుమీది నుండి వ్రేలాడుతున్న పైపులోంచి నీరు ఓ చిన్ని జలపాతంలా దూకుతోంది. మామిడి చెట్టు కొమ్మల్లోంచి పయనించి అలా విరజిమ్ముతూ మట్టిలోకి చేరుకుంటోంది. ఓ పల్లెపడుచు ఆకుపచ్చ పరికిణీని కొద్దిగా పైకి పట్టుకుని అలా గట్టు దాటుతోందా

అనిపిస్తోంది. ఇటుప్రక్క పల్లంగా ఉన్న చోట నీరు నిండింది. ఇది నా ప్రపంచం అన్నట్లు చినుకులు గంతులేస్తుంటే అప్పుడే వేదిక మీద భామా కలాపం ఎవరో ప్రదర్శిస్తున్నట్లుంది.

ఉరుములు వినిపిస్తున్నాయి. అవునూ.. ఎందుకు ఈ మనసు అమ్మాయిల గురించే ఆలోచిస్తోంది? ఏమో ఇదంతా సహజమేమో! ఇద్దరు చిన్నకుర్రాళ్ళు రోడ్డుమీద కావాలని తడుస్తూ నీళ్ళ మీద గంతులేస్తూ వెళ్ళిపోయారు.

పూల కుండీల మాటున పైకి ప్రాకిన మల్లెతీగ మీదుగా ఎంతో నాజూకుగా నీరు జాలువారుతోంది. జడ ఆన్చిన నడుము మీది నుంచి యువతి నిలకడలేని చీర ఎందుకో జారిపోతానంటోంది.

అటు మూల ఉన్న ఒక బుల్లి పైపు మీద నీరు పొంగి నిన్ను ముంచేసాను అంటోంది. ప్రేమ రసభావంతో నిండిన ఖయ్యామ్ రుబాబూ రుబాబుగా గ్లాసుదాటి పొంగి పొరలుతోందా అనిపిస్తోంది.

మెరుపులు మెరిసినప్పుడు ఆకాశం పెద్ద కాన్వాస్‌లా కనిపిస్తోంది. చిత్రకారుని చేతిలోంచి మబ్బుల గుంపులు ఇంపుగా కళాత్మకమైన చిత్రంలోకి అదురుతున్నట్లున్నాయి. ఎప్పుడో అప్పుడు మనసు ఉరకలేయటం చంద్రుడికే కాదు సూర్యుడికైనా తప్పదన్నట్లు అయిన కూడా కొద్దిసేపు దాక్కుంటున్నాడు. సుందరం ఏపాటి?

ఆలోచించాడు. గీత అంటోందేంటి ఛాయ? ఎక్కడ విన్నదీ గీత గోవిందాన్నీ.

తెల్లని సల్వార్ కమీజ్ మీద సన్నజాజి రంగు చున్నీ ధరించి నిలబడేది గీత. ఆ బస్ స్టాప్ పైన రేకుల మీద వాన పడుతుంటే ఆ శబ్దాన్ని గమనించుకుంటూ, ఎదురుగా ముంచెత్తుతున్న వాన ఇంకా ఎంత సేపుంటుందో గమనిస్తూ నిలబడ్డాడు.

పాతైనా ఆ రోజుల్లో కుర్రతనం నేనూ ఉన్నానని వెంట పడేది. నాలుగైదు సార్లు దొంగ చూపులు చూసేసాడు.

'నాకు మీతో మాట్లాడాలని లేదు' అని సూటిగా తనను చూసింది ఆ అమ్మాయి. ఆ మాటకి చుట్టూతా చూసి ఏమనాలో తెలియక రెండు చేతులూ జేబుల్లో పెట్టుకున్నాడు. పక్కున నవ్వింది.

'నాతో అంటున్నారా?', అడిగాడు.

'అవును. మామూలుగా ఇలాంటప్పుడు మాట్లాడిస్తారు కదా, మీలాంటి వాళ్ళు?'

'నాలాంటి వాళ్ళు అంటే?'

'ఓ. పోనీ ఇంకో మాటంటాను. కొందరు మగాళ్ళు'

'నమ్మండి. నేను మాట్లాడాలనుకోలేదు'

'మరి?'

'చూడాలనుకున్నాను!'

ఏదో అనబోయి ఆగింది.

'అది కూడా తప్పే'

'మరి ఏం చెయ్యాలి నేను?'

'ఏం చెయ్యాలి? వాన తగ్గే వరకూ ఆగి వెళ్ళిపోవాలి'

'అయ్యో. అది కుదరదు కదా?'

'ఏం? ఎందుకు కుదరదు?'

'బావుండదు. సామాజిక స్పృహ లేదని మీరనుకుంటారు'

'నేననుకోను, ఇంతకీ ఏం చూస్తున్నారు?'

'మంచి రంగున్నవారు తెల్లరంగు దుస్తులు ధరించటం అవసరమా? అని చూస్తూ ఆలోచిస్తున్నాను'

'ఊ. మీకెందుకా సంగతి?'

'ఈ బస్ స్టాప్‌లో ఉన్నాను కాబట్టి'

'నాన్‌సెన్స్. మీరు వచ్చేముందు ఓ అడుక్కునే వాడు అలా కూర్చున్నాడు.'

'అతను ఏం చేస్తాడు?'

'నాన్‌సెన్స్. ఆఖరుకి అమ్మాయి కనిపిస్తే అడుక్కునే వాడు కూడా ఏదో ఒకటి చెయ్యాలా? అడుక్కున్నాడు.'

'ఏదైనా వేసారా?'

'మీకెందుకు?' దాదాపు అరచినంత పని చేసింది.

'నేనూ అడుక్కునే వాడినే.'

'వద్దు. నేను వెళతాను. సినిమా వద్దు'

'అరె. నా మాట   వినండి. నా మాటకు భిక్షగా కొద్దిగా గౌరవం పొయ్యండి'

'ఏంటి మీ మాట?'

'కలర్ కాంబినేషన్'

చున్నీ ముందరకి లాక్కుని చేతులు కట్టుకుంది.

'మీరెవరో నాకు తెలీదు. నేను'

'సుందర్. ఇండియన్ బ్యాంక్'

దగ్గర కొచ్చింది. 'నేనడిగానా?'

'నేను చెప్పేసాను. బాగుండదని చెప్పాను.'

రెండు చేతులూ జోడించింది.

'బావుంటుంది. ఏమీ మాట్లాడకపోతే బాగుంటుంది'

'అలాక్కాదు. మీరు!?.'

'ఖర్మ. ఇదే నా భార్య. నేనూ బ్యాంకే! ఆంధ్రా బ్యాంక్' బస్సువాడూ అప్పుడే వచ్చాడు. లోపలికెక్కేసి కూర్చుంది. కిటికీ దగ్గిరకు తడుస్తూ కూడా ముందరకి వచ్చాడు సుందరం.

'ఏవండీ.. మీ పేరు చెప్పేస్తే కొద్దిగా'

రెండు చేతులూ నెత్తిన పెట్టుకుంది.

'ఖర్మ!'

'ఛా! అలా ఉండదు'

'కాదు అలానే ఉంది ఈ రోజు నాకు'

'అలాక్కాదండీ. నేను..'

బస్సు కదిలింది. కొద్దిగా నడిచాడు.

'గీత' ఎక్కడినుంచో వినిపించింది.

ఇటు తిరిగాడు. ఓ పెద్దావిడ నిలబడి ఉంది.

'గీత' అన్నది మీరేనా?

'అవును. మా ఆఫీసే...'

అంతసేపు ఓ అమ్మాయితో మాట్లాడటం, అదే మొదటిసారి. నిజానికి అదే ఆఖరు కూడా. కాకపోతే సుందరం ఆ అమ్మాయిని ఎందరితోనో పోల్చుకున్నాడు. అదృష్టమో, దురదృష్టమో, అతి త్వరగానే పెళ్ళయిపోయింది.

వాన వెలుస్తోంది. ఎందుకో ఒక్కసారి ఆ గీత అలా ఓ మెరుపులా మెరిస్తే బాగుండనిపించింది. ఇలాంటి వాన కురుస్తున్న రోజున ఎంచక్కా ఓ గొడుగు పట్టుకుని ఇలా గేటు తెరుచుకుని లోపలికొచ్చి

'ఏవండీ ఈ అడ్రస్సు. '

'అరే మీరా?'

'మిమ్మల్ని ఎక్కడో. '

'కరెక్ట్. '

'ఎంత విచిత్రం?'

లోపలికి వచ్చి 'అయ్యో రండి, ఓ కప్పు కాఫీ. '

ఇలా తెలుగు సినిమాలా జీవితంలోకి వెలుగు ఎందుకు ప్రవేశించదు? ఆలోచిస్తూనే ఉన్నాడు సుందరం పాపం.

ఇవన్నీ సహజమేనేమో. నలభై నిండాక ఎందుకో మబ్బులకు ఓ సిల్వర్ లైనింగ్‌లాగా ప్రతిమగాడికీ ఓ మెరుపు మెరుస్తుంది – ఓ గీత దర్శనమిస్తుంది.

గేటు తెరుచుకుంది. తెల్లని చుడీదార్‌లో ఓ అమ్మాయి గొడుగుతో నిజంగానే లోపలికి వస్తోంది. ఇదేంటి? వర్షాలకి చేను నిక్కపొడుచుకున్నట్లు శరీరం మీది వెంట్రుకలు లేచి నిలబడ్డాయి. ఎక్కడో కాదు ఇక్కడే సినిమా రిలీజ్ అయిపోతోంది. ఘటన అంటే ఇదే. ఇటే వస్తోంది. ఇంట్లో కాఫీ డికాషన్ ఉందో లేదో. ఆమె కిటికీ దాకా వచ్చింది. సుందరం కిటికీ చువ్వలు పట్టుకుని ఎలాగో అలాగ ఈ 'భావసముద్రం'లోంచి విడుదల చేయమంటున్న ఖైదీలా నిలబడ్డాడు. ఆమె చిరునవ్వు నవ్వింది. సుందరం ఇక నవ్వుతూ చంటాడిలా నడిచేస్తాడా అనిపిస్తోంది. అయ్యో, గొడుగు అక్కడ పెట్టేసి లోపలికొచ్చేస్తోంది.

ఆమె లోపలికొచ్చేసింది. 'ఏంటలా చూస్తున్నారు? ఏమైంది?' అంది.

ఇటు తిరిగాడు. ఆమె గీత కాదు, ఛాయ.

'ఏం లేదు..'

'అర్థమైంది. ఈ చుడీదార్ ఎక్కడిదనా?'

'కరెక్ట్. నువ్వు వాడవు కదా? అవునూ..'

'ఏం లేదండీ. వానలో పూర్తిగా తడిసిపోయాను. మా స్టూడెంట్ ఇంట్లో కూర్చున్నాను. ఆ అమ్మాయ్ చీరలు కట్టదు. టక్కున ఈ డ్రెస్ ఇచ్చింది. ఎలా ఉన్నాను?'

'బలే ఉన్నావు. ఉండు ఫోటో తీస్తాను'

ఛాయ లోపలికెళుతోంది. 'అయ్యో వద్దండీ..'

మొబైల్ పట్టుకొచ్చాడు. ఇద్దరూ దగ్గరగా నిలబడి ఫోటో తీసుకున్నారు.

ఆమె లోపలికెళుతూ ఆగింది.

'దోషం లేదా?'

'నో! అస్సలు లేదు.'

(కవిత అందించిన వారు వేదాంతం వేంకట సత్యవతి)

*(వచ్చేనెల మరో కవితకి మరో కథ - కవ్వింత కథ!)*

Post your comments